## మొక్కుబడిగా కౌన్సిల్ మీట్

- మెజార్టీ అధికారపార్టీ కౌన్సిలర్లు గైర్హాజరు



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**హిందూపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త**

హిందూపురం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. అధికారపార్టీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు గైర్హాజరు కాగా 14 మంది మాత్రమే హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశంలో 59 అంశాల అజెండాను చైర్‌పర్సన్ ఇంద్రజ ఏకాభిప్రాయంతో ఆమోదం తెలిపారు. హిందూపురం వైసిపిలో జరుగుతున్న వర్గపోరు రాజకీయ కారణాలతోనే అసమ్మతి వర్గానికి చెందిన మెజార్టీ అధికారపార్టీ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. మొదలైన 10 నిమిషాలకే కౌన్సిల్ సమావేశం ముగించారు. ఇదిలా వుండగా తెలుగుదేశం పార్టీకి చెందిన 6 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం సమీపంలో వుండి కూడా సమావేశానికి హాజరుకాకపోవడం విశేషం.

## అనుమానాస్పదస్థితిలో వైద్యవిద్యార్థి మృతి

**హిందూపురం టౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త**



మృతి చెందిన అక్షిత

తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందిన అక్షిత (26) బుధవారం హిందూపురం పట్టణంలోని వాసవి ధర్మశాల రోడ్డులోని ఓలాడ్జ్‌లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. వివరాలు ఇలా వున్నాయి. వరంగల్ జిల్లాకు చెందిన అక్షిత కర్నాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌లోని మెడికల్ కళాశాలలో పిజి చేస్తోంది. అయితే తెలంగాణ రాష్ట్రం పటాన్‌చెరువుకు చెందిన మరో యువకుడు మహేష్‌వర్మతో కలిసి బుధవారం హిందూపురం పట్టణంలోని లాడ్జ్‌లో దిగారు. సాయంత్రం మహేష్‌వర్మ అక్షిత మృతి చెందిందని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో రెండవ పట్టణ పోలీసులు యువకున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే మృతురాలి భర్త కూడా తెలంగాణలో వైద్యుడు అని పోలీసులు చెబుతున్నారు. మృతురాలికి ఒక కుమార్తె వుంది. విద్యార్థి మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## అథ్లెటిక్స్ పోటీలకు ఎస్‌డిజిఎస్ విద్యార్థి

**హిందూపురం టౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త**



విద్యార్థిని అభినందిస్తున్న బైసాని రాంప్రసాద్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్‌డిజిఎస్ కళాశాల విద్యార్థి నాగేంద్ర ఎంపికైనట్లు కళాశాల కమిటీ తెలిపింది. ఈ నెల 26 నుండి గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి నాగేంద్ర పాల్గొననున్నట్లు వారు తెలిపారు. అథ్లెటిక్స్ పోటీలను ఎంపికైన నాగేంద్రను కళాశాల సెక్రటరీ బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్‌లు అభినందించారు.

## కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

**చిలమత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని కోడూరు, చిలమత్తూరు, వీరాపురం గ్రామాల పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 26న తలపెట్టిన ఛలో కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేసి, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్న గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు, ట్రైంస్కేల్స్ వర కర్లు 2 నుండి 24 నెలల బకాయి జీతాలు చెల్లించి కార్మికుల కుటుంబాలు పస్తులు నుండి కాపాడాలని, నిత్యావసరసరుకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, గుర్తింపుకార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ, పెన్షన్‌తో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అమలు చేస్తున్న ఆక్యూపేషనల్ హెల్త్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించని యెడల సెప్టెంబర్ 1 నుండి నిరవధిక సమ్మె తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రవీణ్‌కుమార్, రామచంరద, గౌస్, నాగప్ప, అశ్వత్థమ్మ, చలపతి, ఆదినారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

## టవర్ క్లాక్ కూల్చివేత ఘటనపై పాలికె కాంగ్రెస్ కార్పొరేటర్‌ల ప్రతిఘటన



టవర్ క్లాక్ కూల్చివేతపై ఎమ్మెల్యే నాగేంద్ర నేతృత్వంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రతిఘటన జరుపుతున్నప్పటి దృశ్యం

**బళ్లారి, ఆగస్టు24, ప్రభాతవార్త**

నగరంలోని రాయలసర్కిల్‌లో టవర్ క్లాక్‌ను బుధవారం అర్ధరాత్రి సమయంలో జేసీబీలతో కూల్చివేయడాన్ని నిరసిస్తూ మహానగరపాలికె కాంగ్రెస్ కార్పొరేటర్‌లు ప్రతిఘటన చేపట్టారు. మహానగరపాలికె పాలనా యంత్రాంగం ఉండగా, జిల్లా యంత్రాంగం పీడబ్ల్యూడీ శాఖ అధికారులతో టవర్‌క్లాక్‌ను కూల్చివేయడం సబబుకాదని, తమదృష్టికి తీసుకురాకుండా టవర్ క్లాక్‌ను కూల్చి వేశారని ప్రతిఘటనకు నేతృత్వం వహించిన రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర ఆరోపించారు. గతంలో ఇదేవిధంగా పురాతన గడియార గోపురాన్ని ఇదే స్థలంలో ఉండగా దానిని కూల్చివేశారని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరిగి టవర్ క్లాక్‌ను నిర్మించారని, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వ హయాంలో మళ్లీ టవర్ క్లాక్‌ను రెండోసారి కూల్చి వేశారని, మహానగరపాలికెలో కాంగ్రెస్ ఆధిక్యంలో పాలనా యంత్రాంగం నడుస్తున్నా అది జీర్ణించుకోలేని బీజేపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా మంత్రి బి.శ్రీరాములు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఈ టవర్ క్లాక్‌ను కూల్చివేశారని చెప్పారు. అభివృద్ధికి తాము అడ్డుకాదని, అయితే నగరపాలికె యంత్రాంగం చేయాల్సిన పని జిల్లా యంత్రాంగం ఆసక్తిగా చేయడం ఏమిటని ప్రశ్నించారు. నగర మేయర్‌కు, కార్పొరేటర్‌లకు తెలపకుండా రాత్రికి రాత్రి గడియార గోపురాన్ని కూల్చివేయడం కార్పొరేటర్‌ల హక్కులు ఉల్లంఘించినట్లేనని ఎమ్మెల్యే నాగేంద్ర ఆరోపించారు. ఈ సందర్భంలో మేయర్ ఎం.రాజేశ్వరి, కార్పొరేటర్‌లు ముల్లంగి నందీశ్, పి.గాదెప్ప, రామంజిని, జబ్బార్, విక్కి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్‌రఫిక్, కేపీసీసీ మాజీ అధ్యక్షుడు అల్లం వీరభద్రప్ప, పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు జిల్లాధికారి కార్యాలయానికి చేరుకుని జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటికి వినతి పత్రం అందజేశారు.

## జగనన్న ఇళ్లలో..ఇంటి దొంగలే వసూళ్లా.. మా తల ఎక్కడ పెట్టుకోవాలి

-ఎరువుల కొరత, ఓపెన్ కాని ఈ క్రాప్ యాప్‌లపై ప్రశ్నల వర్షం
-పాలప్యాకెట్లు పారవేతపై మండిపడ్డ జెడ్‌పిటిసి, వైస్‌ఎంపిపి
-జగనన్న పథకాలకు చెడ్డపేరు తెస్తే ఊరుకోం




ఎసిడిపిఒతో వాగ్వివాదం చేస్తున్న జెడ్‌పిటిసి, వైస్‌ఎంపిపి

**గోరంట్ల, ఆగస్టు 24 ప్రభాతవార్త**

ప్రభుత్వం పేదప్రజలకు మంజూరు చేస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణంలో సంబంధిత శాఖ సిబ్బంది వివిధ రూపాల్లో ఇంటి దొంగలుగా మారి ఒకవైపు వసూళ్లకు మరోవైపు సిమెంట్ విక్రయాలకు పాల్పడితే ప్రజాప్రతినిధులుగా మా తల ఎక్కడ పెట్టుకోవాలంటూ తీవ్రస్థాయిలో హౌసింగ్ అధికారులపై మండిపడ్డారు మండల ప్రజాప్రతినిధులు. మండల సర్వసభ్య సమావేశం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రమీలమూర్తి అధ్యక్షతన ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఆమెతో పాటు జెడ్‌పిటిసి పాలె జయరాంనాయక్, వైస్ ఎంపిపిలు రామలక్ష్మమ్మ, నాగభూషణంరెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ డాక్టర్ బాష, మండల కో ఆప్షన్ మెంబర్ జబ్బార్, అగ్రిచైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు పాటూరి శంకర్‌రెడ్డి, బయపరెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపిడిఒ రఘునాథగుప్తాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గత మూడు నెలల కాలంలో మండల వ్యాప్తంగా వివిధ శాఖల్లో జరిగిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఇందులో భాగంగా గృహనిర్మాణశాఖలో జరుగుతున్న కొన్ని విషయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆశాఖలో పనిచేస్తున్న దిగువస్థాయి అధికారి లబ్ధిదారుల నుండి బిల్లుల మంజూరు కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని అలాగే వారికి అందాల్సిన సిమెంట్‌ను సైతం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నాడని మండల వ్యాప్తంగా స్థానిక ఎమ్మెల్యే ఎక్కడి గడపగడపకు వెళ్లినా బాధిత లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్నారని జెడ్‌పిటిసి పాలె జయరాంనాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిపై డిఇ నాగరాజు స్పందిస్తూ ఆరోపణలు వచ్చిన ఆ వ్యక్తిని ఉన్న ఫలంగా చిలమత్తూరు పంపామని అలాగే ప్రజాప్రతినిధుల ఫిర్యాదు మేరకు ఎక్కడ సమస్యలు వున్నాయో ఆ సమస్యలను వారంలోపు పరిష్కరిస్తామని ఒక అవకాశం ఇవ్వాలని ఆయన వారిని కోరారు. అలాగే బూదిలి సర్పంచు రామాంజినేయులు మాట్లాడుతూ పేద ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో ఇళ్లు నిర్మించుకుంటే మీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వారు బిల్లులు పెట్టని కారణంగా చాలా ఇబ్బంది పడుతున్నారని వారి గోడు ఒక సర్పంచులుగా చూడలేకపోతున్నామని మండిపడ్డారు. అనంతరం వ్యవసాయశాఖపై మండల అగ్రిచైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇంకా 600 మందికిపైగా రైతులు యాప్‌లు ఓపెన్ కాని కారణంగా ఈకెవైసి చేసుకోలేకపోతున్నారని ఆయన వారి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఎరువుల కొరత తీర్చాల్సిన అవసరం వుందన్నారు. గడ్డంతాండా సర్పంచు వాసునాయక్. పుడగుండ్లపల్లి సర్పంచు నర్సిరెడ్డిలు సైతం హౌసింగ్ తీరుపై మండిపడ్డారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడి సెంటర్లలో అవకతవకలు జరుగుతున్నాయని గత రెండు రోజుల క్రితం బాలింతలు, గర్భవతులకు అందాల్సిన ప్రభుత్వ పౌష్టికాహార పాలప్యాకెట్లను చెత్తకుప్పల్లో పారవేయడం ఎంత వరకు సమంజసమని మండల ఎసిడిపిఒ గాయత్రిపై జెడ్‌పిటిసి పాలె జయరాం నాయక్, వైస్ ఎంపిపి రామలక్ష్మమ్మలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దీనిపై ఆమె స్పందించి జరిగిన సంఘటనపై విచారణ కోసం వచ్చానని బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఈ సమావేశం నేపథ్యంలో మండలానికి చెందిన ఓ సూపర్‌వైజర్ జోక్యం ఇది అంగన్‌వాడి సెంటర్ల నిర్వాహకులు పారవేయలేదని లబ్దిదారులే పారవేశారని కప్పి పుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం ప్రజాప్రతినిధుల ఆగ్రహంతో విఫలమైంది. ప్రధానంగా మండల సర్వసభ్య సమావేశం ఆద్యంతం వాడివేడిగా ముగిసింది. ఈ సమావేశంలో సర్పంచులు ప్రభాకర్‌రావు, అశ్వర్థరెడ్డి, శ్రీరాములు, అనిత, వివిధశాఖల అధికారులు, మండల ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## కౌల్‌బజార్ ఫ్లై ఓవర్‌పై రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం



ఫ్లై ఓవర్‌పై జరిగిన ప్రమాద దృశ్యం. విగతజీవులుగా మారిన వీరేష్ కుటుంబ సభ్యులు

**బళ్లారి, ఆగస్టు24, ప్రభాతవార్త**

నగరంలోని కౌల్‌బజార్ రైల్వే ఫ్లై ఓవర్‌పై బుధవారం ఉదయం 9;30 గంటలకు ఓ టిప్పర్ వాహనం మోటార్‌బైక్‌ను ఢీకొనడంతో బైకులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, బాలిక తీవ్రంగా గాయపడిన ఘటన జరిగింది. బళ్లారి తాలుకా ఎర్రగుడి గ్రామానికి చెందిన మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న వీరేష్(35) ఉదయం తన భార్య అంజలి(30)ను బీఈడీ పరీక్ష రాయించేందుకు పిల్లలు దినేష్(05), ఆద్య(03)లను మోటార్‌బైక్‌లో బళ్లారికి చేరుకున్నారు. కౌల్‌బజార్‌లో ఉన్న తన భార్య ఇంటికి వెళ్తుండగా కౌల్‌బజార్ ఫ్లై ఓవర్‌పై వెనకటి నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం డ్రైవర్ అదుపు తప్పి వీరేష్ మోటార్ బైకును ఢీకొంది. దీంతో అదుపు తప్పి వీరేష్, అతడి భార్య అంజలి, కుమారుడు దినేష్ విసురుగా కిందపడి ఫ్లై ఓవర్‌కు తల తగిలి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనలో కుమార్తె ఆద్య తీవ్రంగా గాయపడగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హుటాహుటిన విమ్స్ ఆస్పత్రికి చికిత్సకై తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ లారీ దిగి పరారైనట్లు ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజు తెలిపారు. నగరం మధ్యలో ఉన్న కౌల్‌బజార్ ఫ్లై ఓవర్‌పై భారీ వాహనాల సంచారం పెరగడంతో తరుచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతుండడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ రోడ్డు మార్గం ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నదని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇంతకముందు ఈ మార్గంలో ప్రమాదాలు జరిగి ద్విచక్రవాహనదారులు అనేక మంది గాయపడినట్లు, ఇద్దరు, ముగ్గురు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా, సమాచారం తెలుసుకున్న జిల్లా మంత్రి బి.శ్రీరాములు విమ్స్ ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యుల్ని ఓదర్చారు. అనంతరం జరిగిన ప్రమాద ఘటనపై జిల్లా ఎస్పీ సైదులుఅదావత్‌తో విమ్స్ ఆస్పత్రిలోనే సభ జరిపి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. నగరంలో పగటిపూట టిప్పర్‌లు, లారీల సంచారాన్ని నిషేధించే దిశలో పోలీసు అధికారులతో చర్చ జరిపినట్లు తెలిసింది.

## లోకకళ్యాణం కోసం..కాలినడకన కాశీకి

--గోరంట్ల వాసి గోపాలకృష్ణ పయనానికి జనం జేజేలు



కాలినడక కాశీకి పయనమైన గోపి

**గోరంట్ల, ఆగస్టు 24 ప్రభాతవార్త**

లోక శ్రేయస్సు కోసం తనవంతు బాధ్యతగా తన స్వగ్రామం నుండి కాశీ వరకు రోడ్డు మార్గాన కాలినడకన పయనానికి సిద్ధమయ్యారు గోరంట్లకు చెందిన సమాజసేవకులు గోపాలకృష్ణ. ఈ సందర్భంగా పట్టణంలో ఆయన బయలుదేరే సమయానికి భక్తులు, స్థానిక ప్రజలు ఆయనకు సంఘీబావం తెలుపుతూ జేజేలు పలుకుతూ కొంతదూరం ఆయన వెంట ముందుకు సాగారు. ప్రతి ఒక్కరికి మంచి బుద్ధి కలిగేలా కాశీనాథుడు ప్రసాదించాలని ప్రతి వ్యక్తిలోను తపోగుణం కలగాలని కలియుగం పోయి కృతయుగం మొదలు కావాలని, ప్రజల శ్రేయస్సు, లోక శ్రేయస్సు కోసం తన పాదయాత్ర ఉపయోగపడాలని ఆకాంక్షిస్తున్నట్లు కాశీయాత్రదారుడు గోపాలకృష్ణ అభిప్రాయపడ్డారు. తన గురువులైన ఆదియోగి, సద్గురు, సాగరసింధూరి ఆశీస్సులతో ఈ యాత్రకు నాందిపలికినట్లు ఆయన తెలిపారు.

## వినాయక ఉత్సవాల్లో పోలీసు అనుమతి తప్పనిసరి

-ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్




వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి, ఎఎస్‌పిలు

**పుట్టపర్తి, ఆగస్టు 24, ప్రభాతవార్త**

త్వరలో జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలోని ఎస్‌పి కార్యాలయం నుండి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరుధులలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ముందస్తు అనుమతులు తీసుకున్నవారికి ఉత్సవాలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, ముందుగానే వినాయక ఉత్సవ సమితి సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు విఘతం కలగకుండా ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా చూడాల న్నారు. అందుకోసం ముందుగా ఒక రూట్‌మ్యాప్ రూపొందించుకోవాలన్నారు. అదే విధంగా స్పందన ఫిర్యాదులు, పెండింగ్ కేసుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కోర్టులో దాఖలు చేసిన కేసులకు సంబంధించి మెజిస్ట్రేట్‌తో సంప్రదించి కోర్టు, పోలీస్ కేసు నెంబర్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్‌తోపాటు ఎఎస్‌పి కె.వి.రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి, డిసిఆర్‌డి సిఐ సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎనుములపల్లిలో ఘనంగా పీర్లపండుగ

**పుట్టపర్తి, ఆగస్టు 24, ప్రభాతవార్త**



ఎనుములపల్లిలో ఊరేగింపుగా వెలుతున్న పీర్లు

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లిలో ఘనంగా పీర్లపండుగ నిర్వహించారు. బుధవారం జలధి వేడుకల్లో వేలాది మంది పాల్గొన్నారు. మొహర్రం వేడుకలలో భాగంగా పీర్ల పండుగను నిర్వహించారు. గత మంగళవారంతో మొదలైన ఈ వేడుకలు 9 రోజుల పాటు నిర్విఘ్నంగా నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీక అయిన ఈ వేడుకలు హిందూ, ముస్లిం, క్రైస్తవ అన్ని మతాలు, కులాలవారు పాల్గొని, వేడుకలు జరుపుకొని సమైక్యతను చాటిచెప్పారు. ఏలూరుపల్లి గ్రామంలో జరిగే పీర్లపండుగకు ఒక ప్రత్యేకత సంతరించుకుంది. దప్పు వాయిద్యాల నడుమ ఉత్సాహవంతులు కదం తొక్కి అలావు అడుగులకు ఇక్కడ ప్రత్యేక స్థానం ఉంది. 24 రకాల అలావుగు అడుగులు తొక్కడం ఎనుములపల్లి గ్రామానికి ప్రత్యేకమని గ్రామస్తులు దప్పు కళాకారులు తెలియజేస్తున్నారు. పుష్పాలు, గంధం సువాసనలు,చక్కెర చదివింపులు, వెండి గొడుగుల సమర్పణలు మొక్కుబడులను భక్తులు చెల్లించుకున్నారు. ఈ విధంగా 9 రోజుల పాటు జరిగిన వేడుకలు బుధవారం నాడు జలధి కార్యక్రమంతో ముగించారు.

## విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**కొత్తచెరువు,ఆగస్టు 24, ప్రభాతవార్త**



ఎస్ఐ కె.ఎం.లింగన్న

వినాయక విగ్రహ ప్రతిష్టకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ లింగన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిర్వాహకులు తొలుత నోటరీ చేయించవలెనన్నారు. అందులో విగ్రహం పెట్టే స్థలం, విగ్రహం ఎత్తు, ఎన్నిరోజులు ఉంచేది, నిమజ్జనానికి వెళ్ళే మార్గం, నిమ జ్జనం స్థలం, ఎటువంటి మందుగుండు సామాగ్రి కానీ, డిజె సౌండ్ సిస్టం కానీ పెట్టబోమని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా చూసు కుంటామని నోటరీ నందు నమోదు చేయించాలని తెలిపారు. విగ్రహ నిమజ్జనంకు వెళ్ళే వాహనం యొక్క డాక్యు మెంట్‌లను మరియు డ్రైవర్ లైసెన్స్‌ను జత చేయాలని, ఐదుగురు కమిటీ మెంబర్ల యొక్క ఆధార్ కార్డులను వారి ఫోన్ నెంబర్లతో సహా రాసి అనుమతులు పొందాలని తెలిపారు.

## ప్రధాన కలశాన్ని ఊరేగింపు



కలసాన్ని ఊరేగింపు దృశ్యం

**అమరాపురం, ఆగస్టు 24, ప్రభాతవార్త**

మండల పరిధిలో చిట్నదుగు గ్రామంలో మాడివాళ్ళ మాచిదేవి విగ్రహ ప్రతిష్టాపలో భాగంగా బుధవారం దేవాలయం ప్రధాన కలశానిన ఊరేగింపుగా తీసుకోచ్చి దేవాలయం నందు ప్రతిష్టాపన చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు విద్యుత్ ఏఈ. సీ. సిద్ధేశ్వర, ప్రధాన అర్చకులు చిత్తప్పస్వామి భక్తులు మంజునాథ్, వీరబ్రహ్మయ్య, హనుంతరాయ, తిప్పేస్వామి తదితరులు దేవాలయ ప్రాంగణం వరకు ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేసుకుని వచ్చి కలసాన్ని దేవాలయం వద్ద ప్రతిష్టాపన చేశారు. నేడు విగ్రహ ప్రతిష్ట కార్య క్రమానికి ముఖ్య అతిథులు మాజీ పీసీపీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుల తిప్పేస్వామి, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, అమరాపురం సర్పంచ్ వాగేష్, జెడ్పిటిసి స్వారక్క నరసింహామూర్తి, ఎంపీపీ కెంకెర వీరన్న, తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## ఈసా పరీక్షల ద్వారా పురుగు నివారణ చర్యలు సులభతరం



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**బుక్కపట్నం రూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త**

పొలం పరిసరాల్లో పర్యవేక్షణ విశ్లేషణ(ఈసా) పరీక్షలు నిర్వహించడం ద్వారా పురుగు యొక్క ఉధృతిని కనుగొని ఆ పురుగుని నివారించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలుసుకోవడం ద్వారా ఆ పురుగుల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో సులభతరంగా తెలుస్తుందని మండల వ్యవసాయాధికారి సతీష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో నిర్వహించి పొలంబడి కార్యక్రమం నందు పాల్గొన్న ఆయన వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సతీష్‌బాబు, గ్రామ రెవెన్యూ అధికారి ముత్యాలప్ప, గ్రామ అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ కేశప్ప, గ్రామ రెవెన్యూ అధికారి ముత్యాలప్ప, గ్రామ అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ కేశప్ప, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.సూర్యనారాయణ, ఎంపిఇఓ నాగరాజు రైతులు పాల్గొన్నారు.

## విధులపట్ల అంకితభావంతో పనిచేయండి

- విఆర్‌ఓలు, బిఎల్‌ఓలకు ఆర్డీఓ తిప్పేనాయక్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్, హాజరైన విఆర్‌ఓలు, బిఎల్‌ఓలు

**బత్తలపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న వారు అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తిచేయవచ్చునని విఆర్‌ఓలు, బిఎల్‌ఏలకు ఆర్డీఓ తిప్పేనాయక్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, బిఎల్‌ఓలు, విఆర్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఓటరుకార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని ఆదేశించినా మండలంలో బిఎల్‌ఓలు నిర్లక్ష్యంగా వ్యవహిరంచడం, ఈ క్రాప్‌బుకింగ్‌లో వ్యవసాయ సహాయకులకు విఆర్‌ఓలు సహకరించకపోవడం పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. గతంలో బిఎల్‌ఓలుగా వున్న అంగన్‌వాడీ వర్కర్లు వారికి చదువు తక్కువైనా ఎంతో ఓర్పుతో పనిచేశారని, ఇప్పుడు వచ్చిన అందరూ ఉన్నత చదువులు చదివినవారేనని, అయినా ఇంతవరకు ఆధార్ అనుసంధానం పూర్తిచేయకపోవడం విచారకరమన్నారు. ప్రతి మనిషికి సమస్యలు వుంటాయని, అలాగని మీరందరూ సమస్యలతో వుంటారని భావించడంలేదన్నారు. కొందరికి సమస్యలుంటాయని, అటువంటి వారు వెనుకబడినారంటే అర్థం వుందికాని అందరూ వెనకబడడం పట్ల జాయింట్ కలెక్టర్ ఆగ్రహంతో వున్నారన్నారు. ధర్మవరం నియోజకవర్గం మొత్తం వెనుకబడి వుందని, అందులో బత్తలపల్లి ఇంకా వెనుకబడివుందన్నారు. ఏ పనైనా మనసుపపెట్టి చేస్తే వెంటనే పూర్తవు తుందన్నారు. న్యాయంగా మన విధులు నిర్వహించాల్సిన చోట అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. రెండు మూడు రోజులలోపు ఓటరుకార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం పూర్తిచేయాలన్నారు. అదే విధంగా అగ్రికల్చర్ అసిస్టెంట్లు సైతం ఈ క్రాప్‌బుకింగ్‌లో వెనుకబడి వున్నారని, ప్రభుత్వం రైతుల వ్యవహారంపైన ఆగ్రహంతో వుందన్నారు. ఎవరైతే సరైన పనితనం కనబరచలేదో అట్టివారు వారి స్థానంలో ఎవరిని నియమించాలే సూచించాలని, తహశీల్దార్ అభ్యర్ధన మేరకు ఉన్నతాధికారులు కొత్తవారిని, పనిచేసే సామర్థ్యం వున్న వారిని పంపిస్తారని, అప్పుడు మిమ్మల్లి అక్కడినుండి రిలీవ్ చేస్తారన్నారు. సచివాలయ సిబ్బంది కార్యాలయానికి వచ్చినాము, వెళ్లినాము అనికాకండా మనస్సాక్షితో పనిచేయాలన్నారు. పనిచేయమంటే అది నాదికాదని బాధ్యతరాహితంగా చెప్పడం కాదని నిబద్ధతతో నడుచుకోవాలన్నారు. మనము ఎవరికి అనుకూలంగా పనిచేయాల్సిన అవసరం లేదని, మనస్పూర్తిగా విధులు నిర్వహించాలన్నారు. రాబోయే నాలుగేదు రోజుల్లో కనీసం 60శాతం మేర ఇచ్చిన పనిని పూర్తిచేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎలక్షన్ డిప్యూటి తహశీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటి తహశీల్దార్ హరిప్రసాద్, ఏఎస్‌ఓ శర్మ, ఆర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట అడ్డుకున్న పోలీసులు

- ఆలస్యంగానైనా ప్రతిష్టించి తీరుతాం : స్థానికులు





వాల్మీకి విగ్రహం

స్థానిక వాల్మీకులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన్‌నాయుడు

**రామగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో బుధవారం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించడానికి ఏర్పాటు చేసుకోగా విగ్రహ ప్రతిష్టను రామగిరి ఎస్ఐ జనార్దన్‌నాయుడు అడ్డుకున్నారు. ఉదయం గ్రామంలోని వాల్మీకులు బుధవారం శుభదినం కావడంతో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించడానికి విగ్రహానికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. వెంటనే ఎస్ఐ జనార్దన్‌నాయుడు పోలీసులతో అక్కడికి చేరుకుని విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవని గ్రామంలో వర్గాలున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, కావున అనుమతులు తీసుకుని విగ్రహాన్ని ప్రతిష్టించుకోవాలన్నారు. దీంతో గ్రామస్తులు పోలీసుల తీరుపై తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. తాము మండపానికి భూమి పూజ చేసేటప్పుడు కానీ నిర్మించేటప్పుడు కానీ ఎవరూ అడ్డుచెప్పలేదని అన్ని పూర్తి అయి విగ్రహ ప్రతిష్ట చేసే సమయంలో వైసీపీ నేతలు పోలీసుల ద్వారా అడ్డుకోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహప్రతిష్ట కూడా రాజకీయాలు చేస్తున్నారని మండి పడ్డారు. ఆలస్యంగానైనా విగ్రహప్రతిష్ట నిర్వహించి తీరుతామని స్థానికులు పేర్కొన్నారు.

## లేపాక్షి హబ్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలి

**పుట్టపర్తిటౌన్, ఆగస్టు 24, ప్రభాతవార్త**

లేపాక్షి హబ్‌కు రైతుల నుండి తీసుకున్న భూములను ప్రభుత్వం తిరిగి రైతులకు ఇవ్వాలని శ్రీసత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పుట్టపర్తి పరిసర ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రతి రైతు కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని నమ్మబలికి తక్కువ ధరకే ప్రభుత్వం భూములు తీసుకుందన్నారు. కానీ ఇంత వరకు ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి నాయకులు ఆ భూములపై రుణాల పొంది భూ కుంభకోణానికి దిగారన్నారు. విలువైన భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాడడానికి సిద్ధమౌతామని హెచ్చరించారు.

## క్రీడాపోటీలకు దరఖాస్తు చేసుకోండి

**పుట్టపర్తిరూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త**

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ వారి ఆదేశాల మేరకు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఐదు క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్యశిక్షకులు కె.జగన్నాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను హాకీ, కబడ్డీ, బాక్సింగ్, జూడో, వాలీబాల్ నందు విభాగాలలో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ జట్టు వివరాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ హాకీ శిక్షకులు 8074244599, బాక్సింగ్ శిక్షకులు 9052575995, జూడో శిక్షకుడు 8639138569 వారికి సంప్రదించి 26వ తేదిలోపు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

## సర్కార్ నిర్లక్ష్య మొండి వైఖరి వల్ల ఉద్యోగుల ఆత్మహత్యలు

**ధర్మవరం క్రైం, ఆగస్టు 24 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఉద్యోగులపట్ల జగన్ సర్కార్ నిర్లక్ష్య మొండి వైఖరి వల్ల ఉద్యోగుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం తాడిమర్రి మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సిబిఆర్ డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం నాడునేడు పనుల భారం తదితర పని ఒత్తిడిని భరించలేక సతమతమం అవుతున్నారు. ఇలాంటి యాప్ రూపకల్పన తదితర అంశాలను ప్రభుత్వం వెంటనే ఈ యాప్‌లను ఉపసంహరించుకోవాలని మృతి చెందిన ఉపాధ్యాయుడు హరినాథ్ కుటుంబానికి తక్షణమే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము ఇవ్వాలని తెలుగు దేశం పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి చిట్రా రామ్మోహన్, టిఎన్‌ఎస్‌ఎఫ్ హిందూపురం పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఇర్షాద్, తెలుగు యువత హిందూపురం పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరుమలేష్, హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తోటవాసు, ఎన్‌బికె హరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దఎక్కులూరు గ్రామసమస్య పరిష్కారానికి కృషి చేయండి

**- కలెక్టర్‌కు విన్నవించిన వైసిపి నాయకుడు రవిప్రసాద్‌రెడ్డి**

**- పెద్దపప్పూరులో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యటన**



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రవిప్రసాద్‌రెడ్డి

**పెద్దపప్పూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని పెద్దఎక్కలూరు గ్రామ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వైసిపి జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి విన్నవించారు. చాగల్లు ప్రాజెక్ట్ సమీపంలో వున్న పెద్దఎక్కలూరు గ్రామంలో చాగల్లు ప్రాజెక్ట్ సిపేజ్ కారణంగా గ్రామంలో నీటి ఊటలు ఏర్పడి గ్రామం మురికి కూపంగా మారిందన్నారు. రైతులు పంటలు పండించుకునే అవకాశం లేకుండా పోయిందని గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీరు కారణంగా గ్రామస్తులు గ్రామంలో జీవించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసి గ్రామస్తులు ఇబ్బందుల తీర్చాలని కోరారు. మండలంలోని పెద్దపప్పూరు, షేక్‌పల్లి, అమ్మలదిన్నె గ్రామాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యటించారు. గ్రామాల్లో నిర్మాణంలో వున్న సచివాలయం భవనాలు, ఆర్‌బికె కేంద్రాలను పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్మాణాల్లో చోటు చేసుకున్న సమస్యలపై ఆరా తీశారు. సెప్టెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపప్పూరులో నేతన్న నేస్తం లబ్ధిదారుల గుర్తింపులో కార్మికులకు అన్యాయం జరుగుతోందని సమస్యను పరిష్కరించి నిజమైన చేనేతలకు న్యాయం జరిగేలా చూడాలని కొంతమంది చేనేత కార్మికులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పంటల బీమా తమకు అందలేదని అమ్మలదిన్నె దానిమ్మ రైతులు కలెక్టర్‌కు తెలిపారు. మండలంలో కరివేపాకు పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కరివేపాకు రైతులకు పంటబీమాలో చోటు కల్పించాలని షేక్‌పల్లి రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఒ మధుసూదన్, తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ రామకృష్ణ, ఎఒ ఆంజనేయులు, జెఇ ప్రసన్నకుమార్, ఎంఇఒ నాగరాజు, ఎపిఎం రాజు, ఎపిఒ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సాదా సీదాగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న యం,పీ,పి రఫినాయక్

**తలుపుల, ఆగస్టు24, ప్రభాతవార్త:**

తలుపుల మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదా సీదాగా ముగిసింది. ఈ సర్వసభ్యసమావేశం మండలాధ్యక్షుడు రఫినాయక్ అధ్యక్షతన నిర్వహించారు.ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిథులు హాజరయ్యే సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో యంపిపి అసహనం వ్యక్తం చేశారు.సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిథులు హాజరైన అధికారులకు పలు సమస్యలు తెలిపారు.తహాశిల్దార్ మాట్లాడుతూ ముఖ్యంగా సచివాలయాలలో రెవెన్యూకి సంభందించిన పనులే ఎక్కువ ఉంటాయని,వాటిపై సచివాలయ సిబ్బంది పనితీరు సరిగా లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ఉఫాధ్యక్షులు ఓబుళేశ్వరమ్మ,మహేశ్వర్‌రెడ్డి,తహాశిల్దార్ క్రాంతికుమార్, యంపిడిఓ రామునాయక్ వివిద పంచాయితీల సర్పంచులు,యంపిటీసీలు హాజరయ్యారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

**- తహాశీల్దార్, ఎస్ఐ**



మాట్లాడుతున్న తహాశీల్దార్ రమాదేవి

**యల్లనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**


బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహాశీల్దార్ రమాదేవి, ఎస్ఐ ధోనివెంకట రవికిరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల స్థాయి చైల్డ్‌లైన్ అడ్వైజరీ బోర్డు ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఈ కార్యక్రమానికి తహాశీల్దార్, ఎస్ఐలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు లేని మండలంగా వుండాలని దానికి ప్రతి ఒక్క అధికారి, ప్రజలు కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు చాలా వున్నాయని ముఖ్యంగా మాతృ మరణాలు శిశు మరణాలు అధికమవుతాయన్నారు. కావునా తల్లిదండ్రులు బాలిక విద్యను ప్రోత్సహించి బాల్య వివాహాలు చేయరాదన్నారు. కావునా బాలికలను రక్షించాలని పేర్కొన్నారు. ఎలాంటి బాల్య వివాహాలు మీ దృష్టికి వస్తే వెంటనే చైల్డ్‌లైన్ 1098 లేదా పోలీసుహెల్ప్‌లైన్ 100కు సమాచారం అందించాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ బాలాజీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, విఆర్‌ఒలు, మహిళ సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, తదితరులు

## జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టులు



**తాడిపత్రిటౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త**

తాడిపత్రి మండల పర్యటనలో భాగంగా తాడిపత్రికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి జర్నలిస్టుల సమస్యలపై తాడిపత్రి వర్కింగ్ జర్నలిస్టులు బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో ప్రెస్‌క్లబ్ కోసం స్థలం కేటాయించాలన్నారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగావిద్య అందించేవిధంగా చర్యలుతీసుకోవాలని జర్నలిస్టులు కోరారు. ఇందుకు కలెక్టర్‌సానుకూలంగాస్పందించారు. వినతిపత్రం అందచేసిన వారిలో అధ్యక్షులు అంజి, ఉపాధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, సభ్యులు నాగరాజు, వెంకటరామిరెడ్డి, దిలీప్, పరశురాం, అబ్దుల్, వినోద్, రామాంజి, సిద్ధ, ప్రసాద్, తదితరులు వున్నారు.

## నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్‌కమీషనర్ వి.మల్లికార్జున తెలిపారు. సమావేశంలో పలుఅభివృద్ధిఅంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి సభ్యులు తప్పక హాజరుకావాలని కమీషనర్ తెలియచేశారు.

## పాఠశాలలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**గాండ్లపెంట, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మలమీదపల్లి పంఛాయతీ, బనాన్‌చెరువు పల్లిలో గల ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాల నందు కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి మనబడి, నాడునేడు పథకం క్రింద విడుదలైన రూ. 16లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 10 కాంపోనెంట్ క్రింద కాంపౌండ్ వాల్, స్కూల్ బిల్డింగ్ మరమ్మత్తులు, మంచినీటి సౌకర్యం, ఎల్ఈడి డిస్‌ప్లే, వాటర్‌ప్లాంట్ తదితర పనులకు భూమిపూజ నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రతి పేద విద్యార్థి కార్పోరేట్ స్థాయి విద్యను అభ్యసించే విధంగా విధానంలో కొత్త మార్పులు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి. కృష్ణానాయక్, ప్రధానోపాధ్యాయులు, ఎంపిపి తాతం జగన్‌మోహన్, వైస్ ఎంపిపి ప్రతాప్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రవీంద్రనాయక్, సర్పంచ్ చలపతి, నాగభూషణ్‌రెడ్డి, యూనస్, మాజీ సర్పంచ్ గోపాల్, స్కూల్ కమిటీ చైర్మెన్ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ నరసింహులు, గజ్జల రవీంద్రారెడ్డి, హైదర్‌వలి, హరినాథ్‌రెడ్డి, ఎల్ఐసి శీను, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త**

పట్టణంలోని సెబ్ స్టేషన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఒక కారు, 9 మోటర్‌సైకిళ్లు, ఒక ఆటోకు సంబంధించి వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు 10 శాతం దరావత్తు చెల్లించి తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలిపారు. అదేవిధంగా తాడిపత్రిరూరల్ పోలీసుస్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 32 మోటర్‌సైకిళ్లు, 3 ఆటోలకు సంబంధించి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు రూరల్ సిఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 10 శాతం దరావత్తు చెల్లించి తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని ఆయన తెలియచేశారు.

## విఆర్‌ఒనే కంప్యూటర్ ఆపరేటర్

**-సచివాలయంలో విధులు మరిచి తహాశీల్దార్ కార్యాలయంలో చేరి -ఇబ్బందుల్లో మడుగుపల్లి వాసులు**



తహాశీల్దార్ కార్యాలయం

**పుట్లూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

సచివాలయంలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే కొంత మంది అధికారులు సచివాలయంలో బయోమెట్రిక్ వేసి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని మడుగుపల్లి మండల కేంద్రానికి దాదాపు 30 కిలోమీటర్లు వుంది. కాగా ఆ గ్రామ రెవెన్యూ అధికారి సచివాలయం ప్రజలకు అందుబాటులో లేకుండా తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే గ్రామస్తులకు విఆర్‌ఒతో పనినిమిత్తం మండల కేంద్రానికి రావాల్సిందే. దీంతో ఆ గ్రామస్తులు విస్తుపోతున్నారు. విఆర్‌ఒ అందుబాటులో లేకుండా వుండడంతో స్పందనలో ఫిర్యాదు కూడా చేశారు. ఐనా షరా మామూలే. తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా నవీన్ వాటిపై పరిజ్ఞానం లేకపోవడంతో సర్టిఫికెట్లు రిజిస్టర్ నమోదు చేస్తున్నారు. కుల, ఆదాయ, దృవీకరణపత్రాలు, భూములకు సంబంధించి మ్యుటేషన్స్ కార్యాలయంలో సిబ్బందితో చేయిస్తున్నారు. ఇవి నిబంధనలకు విరుద్ధమైనా ప్రజలకు సేవలను అందించేందుకు తప్పడంలేదని కార్యాలయం సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే మండల కేంద్రానికి దగ్గరలో వున్న సిబ్బందితో పనులు చేయిస్తే మాకు అవస్థలు పడాల్సిన అవసరం వుందని ఆ గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. మ్యుటేషన్స్ సంబంధించి తోటి విఆర్‌ఒలను ఫైళ్లు త్వరగా ఇవ్వడం తెలియదా అని హుకుం జారీ చేస్తున్నారని వారు మదనపడుతున్నారు. అంతేకాకుండా తోటి ఉద్యోగులను హేళన చేసి మాట్లాడుతున్నాడని పలువురు సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా మడుగుపల్లి గ్రామప్రజలకు ఆగ్రామ రెవెన్యూ అధికారి అందుబాటులో వుండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై విఆర్‌ఒ నాగభూషణంను వివరణ కోరగా గ్రామ సచివాలయంలోనే తాను ప్రజలకు ఆందుబాటులో వున్నానని, తోటి ఉద్యోగులను హేళనచేసి మాట్లాడడం, డిమాండ్ చేయడం లేదని తహశీల్దార్ ఆదేశాల మేరకే విధులు నిర్వహిస్తున్నానన్నారు.

## చెన్నమయ్యస్వామి ముఖమండపం ప్రారంభం



ఆలయం మండపాన్ని ప్రారంభిస్తున్న బొంబాయి రమేష్, కాసా చంద్రమోహన్

**యాడికి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని చందనలక్షుంపల్లి సమీపంలో గల చెన్నమయ్యస్వామి నూతన ముఖమండపాన్ని బుధవారం వైకాపా మండల కన్వీనర్ బొంబాయి రమేష్ ప్రారంభించారు. యాడికి మండలం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు చెన్నమయ్యస్వామి ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్నారు. రామన్నగుడిసెలు ప్రాంతం నుండి దారి మధ్యలో కొండలపై స్వయంభువుగా వెలసిన స్వామి కొలిచిన వారికి కొంగు బంగారంగా భక్తులు విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం భక్తులు, దాతల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాది కారక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖపండపాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, తిరుపతి, పొంతల కిట్టయ్య, బాలిరెడ్డి, శశిధర్, చౌదరి, భాస్కర్, ఆలయ పూజారి దాసరి రామానాయుడు, పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చెన్నమయ్యస్వామి

## అర్హులందరికి పథకాలు అందాలి

**- కన్వీనర్ బొంబాయి రమేష్**



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**యాడికి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని అర్హులైన వారందరికి అందేలా చూడాలని వైకాపా మండల కన్వీనర్ బొంబాయి రమేష్ పేర్కొన్నారు. స్థానిక మీటింగ్‌హాల్‌లో బుధవారం వాలంటీర్లతో అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బొంబాయి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వాలంటీర్లు వారధిలాంటివారన్నారు. ప్రభుత్వం ద్వారా అందే ప్రతి సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకరావాలని ఎంపిడిఒ వెంకటేష్ పేర్కొన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో వుండాలని, లబ్దిదారులు కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాల్సిన బాధ్యత వాలంటీర్లదే అని ఎంపిపి ఉమాదేవి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇఒ శ్రీనివాసులు, ఎంపిటిసిలు రామ్మోహన్, నాగరాజు, కార్యదర్శి రామ్‌సతీష్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం

**యాడికి, ఆగస్టు 24 ప్రభాతవార్త**



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న వర్ష

మండలంలోని రాయలచెరువులో వున్న లీలావతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాడికి చెందిన పత్రికా విలేకరి రంగస్వామి కుమార్తె వర్ష పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వర్ష స్వయంగా వృద్ధులకు భోజనం వడ్డించింది. అనంతరం వృద్ధులు చిన్నారి వర్షను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విలేకరితో పాటు ఆయన భార్య రాధిక, ఆశ్రమం నిర్వాహకురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మల్లూరమ్మ ధ్వజస్తంభ ప్రతిష్ట పూజలు

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని

ధ్వజస్తభం ప్రతిష్టాపన కార్యక్రమం



వెంకటాపురం పంచాయితీ మజరా నారప్పగారిపల్లి గ్రామ సమీపంలో సోమావతి ఏటిగడ్డపై వెలసిన మల్లూరమ్మ తల్లి ధ్వజస్థంభ ప్రతిష్టాపన బుధవారం అంగరంగ వైభవంగా ఎంతో భక్తిశ్రద్దల నడుమ నిర్వహించారు. మల్లూరమ్మ తల్లి నూతన దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఆలయ ముఖద్వారం ఎదుట వేద పండితులు, రుత్వికుల మంత్రోచ్చారణల మధ్య ఎంతో వైభవంగా ధ్వజస్థంభ ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. ముందుగా ప్రథమ పూజలు అందుకునే విఘ్నరాజైన వినాయకుని హోమం, 108 కళశాల జలాభిషేకం, దూపదీప కుంకుమ, పసుపు, పుష్పాల పూజలతోపాటు ఫలాలతో నైవేద్యం, పట్టు వస్త్రం సమర్పించి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్థంభం వద్ద వెంకటాపురం, యం కొత్తపల్లి, వడ్డివారిపల్లి గ్రామస్తులతో పాటు తదితర ప్రాంతాలకు చెందిన భక్తాదులు కాయ కర్పూరం సమర్పించి పూజా కార్యక్రమాలో పాల్గొన్నారు. వందలాది మంది తరలివచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వేళ చక్కభజనలు నిర్వహించి వివిధ సాంస్కుతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## మల్లూరమ్మ గుడికి ఇన్వర్టర్ వితరణగా ఇచ్చిన వైసిపి నేత జౌళి బాబా

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని సోమావతి ఏటి గడ్డపై వెలసిన మల్లూరమ్మ తల్లి ఆలయానికి ఓడీచెరువు మండల కేంద్రానికి చెందిన సత్యసాయి జిల్లా మైనార్టీ నాయకుడు జౌళి బాబా బుధవారం ఇన్వర్టర్‌ను వితరణ గా ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా అమ్మవారి ఆలయాన్ని అత్యాధునిక హంగులతో నిర్మాణం చేపట్టి గత రెండు రోజులుగా విశేషమైన పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, నిర్వాహకులకు జౌళి బాబా ఇన్వర్టర్‌ను అందచేశారు. అనంతరం జౌళి బాబా మాట్లాడుతూ ఎంతో మహిమ గల మల్లూరమ్మ దర్శనానికి మండల వ్యాప్తంగా కాక సుదూర ప్రాంతాల నుంచి భక్తాదులు తరలివస్తారని రాత్రి వేళల్లో కరెంట్ పోతే ఈ ఆటవీ ప్రాంతం, ఏటి గడ్డ ప్రాంతం అయినందున భక్తాదులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తమ వంతుగా ఇన్వర్టర్‌ను సమకూర్చడం జరిగిందన్నారు. భవిష్యత్తులో అమ్మవారికి తన శక్తికి మించి మరింత సహకారం అందిస్తానని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బాబాకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.




మల్లూరమ్మ గుడికి ఇన్వర్టర్ విరాళం ఇచ్చిన బాబా

## రక్తదానం చేసిన యువకులు

**శ్రీసత్యసాయిజిల్లా (వైద్యం), ఆగస్టు 24, ప్రభాతవార్త**

అత్యవసర సమయంలో స్పందించిన యువకులు మూడు యునిట్ల రక్త దానం చేసి ఉదారత చాటుకున్నారు. వివరాల ప్రకారం శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నందు మహారాష్ట్రకు చెందిన తేజేశ్వర్ గుండె శస్త్రచికిత్స కొరకు అలాగే అనంతపురంకు చెందిన పాతిమ అనే మహిళకు, అలాగే ఒక బాబకు కొరకు అత్యవసరంగా రక్తం కావాలని ఖిద్మత్ ఎ ఖల్క్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు షామీర్‌ను సంప్రదించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన తమ సొసైటీ వారికి సమాచారం అందించగా, మురళీ, రవి, మహబూబ్‌బాషా అనే యువకులు స్వచ్ఛంధగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసిన సదరు యువకులకు ఆయా రోగుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



రక్తదానం చేస్తున్న యువకులు దృశ్యం

## ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

**- ఎమ్మెల్యే సిద్ధారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కదిరి, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

కదిరి మున్సిపాలిటి పరిధిలోని కుటాగుళ్ళ మున్సిపల్ పాఠశాలలో బుధవారం మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ డెవలప్‌మెంట్ కోసం జరుగుతున్న భూ సర్వే గ్రామ సభలో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్ఐజి అభివృద్ధి కోసం చేస్తున్న భూ సర్వేలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరక్కుండా న్యాయం చేస్తామన్నారు. ఎంపిక చేసిన భూమి నందు ఎవరికైతే హక్కు ఉందో వారిని గుర్తించి వారికి అన్ని విధాలా ప్రభుత్వం తరుపున న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ భూసేకరణలో రైతులకు ఎటువంటి అనుమానాలు ఉన్నా రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి అనుమానాలను నివృతి చేసుకోవాల్సిందిగా వివరించారు. ఎవరూ అధైర్య పడవల్సిన అవసరం ఏమిలేదని ఈ ఎమ్ఐజిలో ప్రతి రైతుకు తప్పక న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో ఆర్డీఓ రాఘవేంద్ర, ఇన్‌చార్జ్ తహశీల్దార్ ముకుంద, కౌన్సిలర్లు రంగారెడ్డి, మహమ్మద్, ఆవుల స్వామి, ప్రణీత్‌రెడ్డి, భూ నిర్వాశితులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద నివారణకు ప్రత్యేక చర్యలు

**- కదిరి డిఎస్పీ భవ్యకిశోర్**



లోకేష్‌కు నగదు రివార్డును అందచేస్తున్న డిఎస్పీ

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త :**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కదిరి డిఎస్పీ భవ్యకిశోర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం వివిధ అంశాలపై ఎస్సై గోపితో వివరాలను సేకరించారు. ముఖ్యంగా మండల కేంద్రంలో 5 ప్రైవేటు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ఇంటర్, డిగ్రీ, ఐటిఐ కళాశాలలు ఉన్నట్లు గుర్తించారు. అనునిత్యం విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసించడానికి రావాల్సి ఉంటుందన్నారు. అందువల్ల అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసే పాయింట్లను గుర్తించారు. అలాగే స్పీడ్ నియంత్రణ, ప్రమాద సూచికల బోర్డులను ఏర్పాటు చేసేందుకు ఆర్అండ్‌బి శాఖ అధికారులకు సిఫారస్సు చేస్తున్నట్లు వారు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల డ్రైవర్లు సైతం రోడ్డు నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా నడపాలన్నారు. వాహనాల డ్రైవర్లు లైసెన్సులు తప్పనిసరిగా కలిగిఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ సిఐ నిరంజన్‌రెడ్డి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో గత 25 సంవత్సరాలుగా వివిధ నేరాలకు పాల్పడి పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదు కాబడి, పోలీసుల కల్లుగప్పి తిరుగుతున్న వడ్డే వెంకటరాముడు అనే ముద్దాయిని ఎంతో చాకచక్యంగా ఎంతో సాహసం ప్రదర్శించి లోకేష్ అనే కానిస్టేబుల్ అతన్ని పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సదరు పోలీస్ కానిస్టేబుల్‌ను డిఎస్పీ, సిఐలు ప్రత్యేకంగా అభినందించి రివార్డును అందచేశారు.

## స్పందనలో వచ్చిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి- ఎంపిడిఓ

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త :**



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

సచివాలయానికి స్పందన గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే పరిష్కార మార్గం చూపాలని ఎంపిడిఓ పోలప్ప ఆదేశించారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ పోలప్ప మాట్లాడుతూ సచివాలయానికి రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మ్యుటేషన్‌లకు సంబంధించిన దరఖాస్తులను కూడా త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 గంటల లోపు బయొమెటిక్‌లో హాజరు నమోదు చేసుకోవాలన్నారు. కొంత మంది ఆలస్యంగా హాజరు వేస్తున్నారని నిర్ణీత సమయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. సచివాలయ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందించాలన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థలో నూతనంగా ప్రవేశపెట్టిన గ్రీవెన్స్ స్పందనను ప్రతి రోజూ 3 గంటల నుండి 5 గంటల వరకూ తప్పనిసరిగా నిర్వహించి ప్రజల నుండి వచ్చే అర్జీలను స్వీకరించాలన్నారు.

## సిపిఎస్‌రద్దుపై ఛలోవిజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**కొత్తచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త**

సిపిఎస్ రద్దు విషయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచి కాలయాపన చేస్తున్న నేపథ్యంలో సెప్టెంబర్ 1న చేపట్టిన చలోవిజయవాడ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్‌నాయకులు కోరారు. బుధవారం కొత్తచెరువు, బుక్కపట్నంకు చెందిన ఎపిటిఎఫ్‌నాయకులు జడ్పి ఉన్నత పాఠశాలలో పుట్టపర్తిజోన్ సమావేశం నిర్వహించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ముఖాధారిత అటెండెన్స్ వల్ల తీవ్ర సమస్యలు ఎదర్కొంటున్నామని, ముఖాధారితి అటెండెన్స్ డివైజ్‌లు పాఠశాలలకు సరఫరా చేస్తేనే అటెండెన్స్ చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాలలయందు తెలుగు, ఇంగ్లీష్‌మీడియం లను పూర్వ స్థితిలోనేకొనసాగించాలని, పాఠశాలలను విచ్ఛిన్నం చేసే 3,4,5 తరగతుల విలీనంను ఆపాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్.చంద్ర, జిల్లా గౌరవాధ్యక్షులు బి.వి.మాధవ, మండల ప్రధాన కార్యదర్శి సాయి, శివ, బుక్కపట్నం మండల అధ్యక్షులు విజయ్, తలమర్ల నరసింహులు, అంజనమూర్తి, డి.ఈశ్వరప్ప, చలపతి, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

